క్లుప్తంగా

కనకదుర్గమ్మకు పూజలు



పూజలందుకున్న కనకదుర్గమ్మ

టి.నరసాపురం: బొ(్రం)పాలెంలో కనక దుర్గమ్మ ఆలయ 36వ వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దుర్గమ్మకు కుంకుమ పూజలు చేశారు. ఉత్సవాలు ఐదురోజులు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఆఖరి రోజు అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని, భక్తులు ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త వీరంకి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన ఇద్దరు భక్తులు వేరువేరుగా ఆదివారం రూ.2,00,032 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా పర్వతనేని వెంకట సుబ్బారావు రూ.1,00,016, గరిమెళ్ల నిహిత్ రూ.1,00,016 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబాలకు ఆలయ సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాలను అందించారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు



పోలవరం విజ్ఞాన భారతి హైస్కూల్‌లో హిందీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: స్థానిక విజ్ఞాన భారతి హైస్కూల్‌లో ఆదివారం దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో హిందీ పరీక్షలు నిర్వహించారు. నందిగం హరిశంకర్ హిందీ ప్రచారక్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించగా, వివిధ కేటగిరీల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సుమారు 58 మంది విద్యార్థులు పరిచయ, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశిక పరీక్షలకు హాజరైనట్లు నిర్వాహకులు నందిగం హరిశంకర్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం



కన్నాపురం జెడ్పీ హైస్కూల్‌లో ఆయమ్మకు ఆర్థిక సహాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

కొయ్యలగూడెం: కన్నాపురం జెడ్పీ హైస్కూల్‌లో పనిచేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆయమ్మకు ఆదివారం పూర్వ విద్యార్థులు రూ.6,500 ఆర్థిక సహాయం అందజేశారు. దీనమ్మ (ఆయమ్మ) హైస్కూల్‌లో సుమారు 20 ఏళ్లుగా సేవలందిస్తూ విద్యార్థులను తన సొంత పిల్లలుగా సాకిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఆమెకి కృతజ్ఞతలు తెలుపుతూ 2002-03 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ తరుపున ఆర్థిక సహాయం అందించారు. అదే విధంగా గ్రామానికి చెందిన మట్టే ప్రసాద్ ఫౌండేషన్ దీనమ్మకు నిత్యావసర సరుకులు, సామాగ్రి ఉచితంగా అందజేసింది. ఈ కార్యక్రమంలో పెనుమాక శ్రీను, దమ్ము ప్రసాద్, విస్సాకోటి మంజునాథ్, బొమ్మ కిషోర్, మట్టే శ్రీను పాల్గొన్నారు.

కుక్కునూరులో ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కుక్కునూరు: స్థానిక శ్లోక స్కూల్ నందు సూర్య ఆసుపత్రి వైద్యులచే ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుగర్, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 500 మందికి వైద్యసేవలు అందించారు. ఏజెన్సీ ప్రాంతంలో వైద్యం అందించడం బాధ్యతగా భావిస్తున్నట్లు భద్రాచలం సూర్య ఆసుపత్రి వైద్యులు డా.గీతాపావని, డా.ఎన్ఎస్ పవన్‌రెడ్డి పేర్కొన్నారు. శ్లోక స్కూల్ కరస్పాండెంట్ మాదినేని శ్రీనివాస్, సర్పంచ్ రావు మీనావినోద్, ముదియాల జయచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో జాతరకు ఏర్పాట్లు

- ఈనెల 12 నుంచి దుర్గమ్మ, నాగదుర్గాదేవి, గద్దెరాజుల జాతర
- మాఘ శుద్ధ పౌర్ణమిలో వైభవంగా జరగనున్న మహోత్సవాలు
- ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయ పద్ధతిలో పూజలు



బుట్టాయగూడెం మండలంలోని కామవరంలో కొలువై పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ, గుబ్బల మంగమ్మ అమ్మవార్లు, నాగదుర్గాదేవి అమ్మవారు



బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో దేవతల జాతరలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ నెల 12వతేదీ నుంచి 15వ తేదీ వరకూ ఐ బుట్టాయగూడెం మండలం కామవరం సమీపంలో దుర్గమ్మతల్లి, గుబ్బల మంగమ్మతల్లి, నాగదుర్గాదేవి, గద్దె రాజులు జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా మాఘశుద్ధ పౌర్ణమి రోజు నుంచి ఈ జాతర మహోత్సవాలను గిరిజనులు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు.

అమ్మవార్లకు విశేష పూజలు

బుట్టాయగూడెం మండలం కామవరం సమీపంలో జరగనున్న జాతర మహోత్సవాల్లో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తారు. 12వ తేదీ ఉదయం 6 గంటలకు అమ్మవారికి పసుమ కుంకుమ పూజలు, వర్సా వారి ఇలవేల్పు గద్దె రాజులు, గుబ్బల మంగమ్మతల్లి, దుర్గమ్మ, నాగదుర్గాదేవి అమ్మవార్లను రాజుపట్నం పోసి డోలు వాయిద్యాలతో గద్దె మీదకు తీసుకువస్తారు. 13వ తేదీ అమ్మవారికి విశేష సర్వత్ర పూజ ఆదివాసీల సంబరాలతో జరుగుతాయి. మధ్యాహ్నం మేళ తాళాలతో దట్టమైన అడవిలో గుహలో కొలువై నెమలి పాన్పుపై కూర్చుని ఉన్న గుబ్బల మంగమ్మ అమ్మవారిని అక్కడ నుంచి కామవరం వరకూ డోలు వాయిద్యాతో రాజు గద్దెల మీద తీసుకువస్తారు. 14వ తేదీన అమ్మవారికి కుంకుమ సౌభాగ్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే అడవిలోకి వెళ్లి పుట్ట బంగారాన్ని గద్దెల మీద తీసుకు వచ్చి అమ్మవార్లకు సంబరాలు చేస్తారు. 15వ తేదీన విశేష పూజలు, అమ్మవారిని భక్తుల గృహాలకు తీసుకువెళ్లి పసుపు, కుంకుమలతో ఒడి బియ్యం సమర్పిస్తారు. అదే విధంగా రాత్రి సమయంలో బోనం ఎత్తుకొని డోలు వాయిద్యాలతో సంబరాలు చేసి ఆ బోనాన్ని సమర్పిస్తారు. అలాగే తెల్లవారుజామున 3 గంటల నుంచి అమ్మవారి నిప్పుల గుండం కార్యక్రమం నిర్వహిస్తారు. 16వ తేదీ ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి పుట్టింటి చీర, సారె కావిడితో, నాటుకోళ్లు, మేక పోతులతో అమ్మవారికి మొక్కులు చెల్లించడంతో జాతర మహోత్సవాలు ముగుస్తాయి. జాతర జరిగే ఐదు రోజులు ఆలయాల వద్ద ప్రతి రోజు అన్న సమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

> **జాతరను జయప్రదం చేయాలి**
>
> 
>
> కామవరంలో జరగనున్న జాతర మహోత్సవాల్లో ఆదివాసీ గిరిజన సంస్కృతి, సాంప్రదాయం పద్ధతిలోనే అమ్మవారికి పూజలు నిర్వహిస్తాం. ఈ జాతర మహోత్సవాల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలి.
>
> – వర్సా పుల్లారావు, ఆలయ పీఠాధిపతి, కామవరం

సోలార్ ప్యానల్స్ బహూకరణ



గుబ్బల మంగమ్మ ఆలయ కమిటీకి సోలార్ ప్యానల్స్‌ను బహూకరిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మగుడికి హైదరాబాద్‌కు చెందిన పి. చైతన్య సుధాకర్, మండలంలోని బూరుగువాడకు చెందిన కుంజా నాగరాజు ఆధ్వర్యంలో 6 సోలార్ ప్యానల్స్‌ను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు బహూకరించారు. వారికి ఆలయ కమిటీవారు కృతజ్ఞతలు తెలిపారు.

నర్సరీ ఏర్పాటు చేయాలని వినతి



నర్సరీ ఏర్పాటు చేయాలని కోరుతున్న స్థానికులు

కొయ్యలగూడెం: రాజవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన ప్రాంగణంలో నర్సరీ ఏర్పాటు చేయాలని స్థానికులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నర్సరీ ఏర్పాటు చేస్తుండడంతో కొందరు వ్యక్తులు సంబంధిత ప్రభుత్వ అధికారులకు అభ్యంతరాలు తెలిపిన నేపథ్యంలో అందుకు వ్యతిరేకంగా వీరంతా సమావేశం నిర్వహించారు. నర్సరీ ఏర్పాటు వల్ల కూలీలకు లబ్ధి చేకూరుతుందని, విద్యార్థులకు గాని లేదా హైస్కూల్‌లో నిర్వహించే విధులకు గాని ఏ విధమైన ఆటంకం ఉండబోదన్నారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ తీర్మానాలను కూడా నర్సరీ శాఖ ఏర్పాటుకు అటవీ శాఖ అధికారులు తీసుకోవడం జరిగిందని తెలిపారు. షేక్ ఫాతిమా బీబీ, షేక్ రసూల్, షేక్ వెంకన్న, బి.మహేశ్వరి, కె.లలిత, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పేకాటపై దాడి

జంగారెడ్డిగూడెం: పట్టణంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.24,600 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు.

కోడిపందేలపై దాడి

పేరంపేట శివారు కోడిపందేలపై దాడి చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ముగ్గురిని అరెస్టు చేసి ఒక కోడిపుంజు, ఒక కోడి కత్తి, రూ.2,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చింతలపూడి బొగ్గు నిల్వలను వెలికితీయాలి

చింతలపూడి: చింతలపూడి ప్రాంతంలో ఉన్న బొగ్గు నిల్వలను వెలికి తీసి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు తొర్లపాటి రాజు కోరారు. చింతలపూడిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6 నుంచి 8 వరకు జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల్లో చింతలపూడి కేంద్రంగా బొగ్గు వెలికితీత కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఏలూరులో మూతపడ్డ జూట్ మిల్లులు స్థానంలో ప్రభుత్వ రంగ పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని తీర్మానించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నికైన తొర్లపాటి రాజుకు ఆ సంఘ చింతలపూడి నియోజకవర్గ నాయకులు ఖమ్మం ప్రసన్నకుమార్, వడ్డే రామారావు, పండగ శేఖర్, పిట్ట టైని, డోల రాజేష్, టి అంబేద్కర్, మాజీ ఏఐవైఎఫ్ నాయకులు తొర్లపాటి బాబు తదితరులు అభినందనలు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

టి.నరసాపురం: వివాహిత ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎం.రాజు తెలిపారు. బొర్రంపాలెంకు చెందిన సకలాబత్తుల శ్రీను, ఉషారాణిలకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల శ్రీను తనను అనుమానిస్తూ శారీరికంగా, మానసికంగా వేధిస్తున్నాడని, దీనికి అతని కుటుంబసభ్యులు సహకరిస్తున్నారని ఉషారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

మన్యం బంద్‌ను జయప్రదం చేయండి



వేలేరుపాడు: ప్రజాసంఘాల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



కుక్కునూరు: బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

వేలేరుపాడు: ఈనెల 11, 12 తేదీల్లో తలపెట్టిన 48 గంటల నిరవధిక రాష్ట్ర మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ, గిరిజన ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఆదివారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో వేలేరుపాడు మండలం పూచిరెలా గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి మడకం ఏసుబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి కారం ధారయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ మాట్లాడారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు విశాఖలో జరిగిన పర్యాటక అభివృద్ధి సదస్సులో ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం అడ్డుగా ఉన్నాయని వ్యాఖ్యానించడం దారుణం అన్నారు. ఆ చట్టాలను సవరణ చేయడం ద్వారా పెట్టుబడులు ఆకర్షించి పర్యాటక రంగం అభివృద్ధి చేయొచ్చని, ఆ చట్టాలను సవరణ చేయాలనీ అనడం అయన అవివేకానికి నిదర్శనం అన్నారు. అయ్యన్నపాత్రుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, గిరిజన ప్రజానీకానికి వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మన్యం బంద్‌లో మండలంలోని ఆదివాసీ, గిరిజన సంఘాలు, ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వ్యాపార, వర్తక, వాణిజ్య సంఘాలు, స్కూల్స్, కాలేజీలు, హోటల్స్ స్వచ్ఛందంగా మూసేసి సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడివి దుర్గారావు, నాయకులు కారం వెంకట్రావు, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షుడు కట్టం వెంకటేశ్వర్లు, కంగాల గంగరాజు, ఆదివాసి యువ చైతన్య సంఘం నాయకురాలు మడకం సునీత, రజిని తదితరులు ఉన్నారు.

ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలి

కుక్కునూరు: అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టానికి సవరణ చేయాలని చేసిన వ్యాఖ్యలను నిరసనగా ఈ నెల 12వ తేదిన చేపట్టిన ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కూరం సంజీవరావు పిలుపునిచ్చారు. ఏఎస్‌పీ మండల కమిటీ సమావేశం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో జరిగింది. సంజీవరావు మాట్లాడుతూ తక్షణమే ఆదివాసీ సమాజానికి అయ్యన్నపాత్రుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే షెడ్యూల్ ఏరియాలో అభివృద్ధి చేయాలి అంటే పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు మార్చడం కాదన్నారు. జీఓ నెంబర్ 3ను సుప్రీం కోర్టు రద్దు చేసిందన్న సాకుతో ఆదివాసీ ప్రాంతంలో ఉద్యోగావకాశాలను మైదాన ప్రాంతం వారితో నియామకాలు జరుపుతున్నారని అటువంటి అభివృద్ధి ఆదివాసీలకు అక్కర్లేదన్నారు ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రచార కార్యదర్శి పోడియం వేణుగోపాల్, సరియం ప్రసాదరావు, చిన్నబాబు, పాపారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు .

సుజుకి యాక్సెస్ వాహనం విడుదల



సుజుకి యాక్సెస్ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సుజుకి యాక్సెస్ వాహనాన్ని పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఏలూరు మార్కెట్‌లోకి విడుదల చేశారు. స్థానిక హోటల్ ఎన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ వాహనాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, ఎస్ఎంఆర్ పెదబాబు, రెడ్డి అప్పలనాయుడు, శ్రీకృష్ణ సుజుకీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

‘కూటమి అభ్యర్థికి ఎందుకు ఓటెయ్యాలి’

కొయ్యలగూడెం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి ఎందుకు ఓటు వేయాలి అంటూ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మరో అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇరవై లక్షలు ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి పాలనలోకి వచ్చాక నీళ్లు వదలడంతో పాటు కూటమి ప్రభుత్వం 20 మద్యం షాపులు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చిన ప్రభుత్వం పట్టభద్రుల ఎన్నికల్లో ఎలా పోటీ చేస్తుందని, నిరుద్యోగులను ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతుందని ధ్వజమెత్తారు. దుర్గాప్రసాద్‌ను వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు కలిశారు.



అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాదను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు

కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి చిక్కాల దుర్గాప్రసాద్‌ని గెలిపించాలని వైఎస్సార్ సీపీ యూత్ నేత యడ్లపల్లి సురేష్, నాయకులు పిలుపు ఇచ్చారు.

కమనీయం.. శివయ్య కల్యాణం

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని, పరిసరాలను సుగంధ భరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. ఆ తరువాత కల్యాణ తంతును ప్రారంభించి, సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. సుముహూర్త సమయంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, భక్తుల శివనామస్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను కన్నులపండువగా జరిపి, కల్యాణ మూర్తులకు హారతులిచ్చారు. ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



ద్వారకాతిరుమల క్షేత్రపాలకుని ఆలయంలో శివదేవుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: రాట్నాలకుంట గ్రామంలో వేంచేసియున్న శ్రీ రాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వారం అమ్మవారికి పూజాటిక్కెట్లపై రూ.32,600, విరాళాల రూపంలో రూ.20,100, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.21,510, వెరశి మొత్తం రూ.74,210 ఆదాయం లభించినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ తెలిపారు.

వైభవం.. వీరేశ్వరస్వామి కల్యాణం

పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్యలో గల పట్టిసీమ శైవక్షేత్రంలో శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభయ్యాయి. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. పాత పట్టిసీమ గ్రామంలో ముందుగా శివ కల్యాణం రాయభారం నిర్వహించారు. అనంతరం 10 గంగటలకు కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం పాత పట్టిసీమలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. 10వ తేదీన సదస్యము, అనంతరం పోలవరంలో గ్రామోత్సవం, 11న స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, 12న నాగవల్లి వసంతోత్సవం, 13వ తేదీన పుష్పయాగం, పవళింపు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం ఈవో చాగంటి సురేష్ నాయుడు తెలిపారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కొచ్చర్లకోట వీరభద్రరావు దంపతులు పూజలు నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని స్వామివారి కల్యాణ మహోత్సవాలు తిలకించారు. ఈ కార్యక్రమానికి పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్సై ఎస్.పవన్ కుమార్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు.



పట్టిసం శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కివ్వాక వద్ద అదుపు తప్పిన కారు

కుక్కునూరు: ఆర్అండ్‌బీ అసంపూర్తి పనుల కారణంగా మండల వాసుల ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఆదివారం కుక్కునూరుకు చెందిన ఓ వ్యాపారి కారులో బూర్గంపాడు వెళ్తుండగా కివ్వాక గ్రామం వద్ద రోడ్డుపై లేచిన దుమ్ము కారణంగా దారి కనపడక ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో కారు అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు వ్యాపారి అతని భార్య ఎటువంటి గాయాలు లేకుండా బయట పడగా కారు మాత్రం పూర్తిగా దెబ్బతింది. ఇటువంటి ప్రమాదాలు పలు జరుగుతున్నా అధికారులు రోడ్డు నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంక్రాంతి సమయానికి రోడ్లు పూర్తిచేస్తామన్న ప్రభుత్వం ప్రజల ప్రాణాలు పాయేవరకు స్పందించదా అని మండల ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొయ్యలగూడెంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1985-86 బ్యాచ్ విద్యార్థులు

కొయ్యలగూడెం: స్థానిక హైస్కూల్‌లో 1985–86 సంవత్సరాలలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మిత్రులంతా కలిసి చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకుని ఉత్సాహంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించి ఆశీస్సులు అందుకున్నారు. దివంగతులైన ఉపాధ్యాయులకు, మిత్రులకు నివాళులు అర్పించారు.

అచ్చాయమ్మకు నివాళి



అచ్చాయమ్మకు నివాళులు అర్పిస్తున్న తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నేతలు

పోలవరం రూరల్: కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోట రామకృష్ణ, కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పరామర్శించారు. రామకృష్ణ అమ్మమ్మ జల్లేపల్లి అచ్చాయమ్మ ఇటీవల మృతిచెందడంతో ఆమె స్వగ్రామమైన పోలవరం మండలం నూతనగూడెంలో దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తలారి వెంకట్రావు అచ్చాయమ్మకు నివాళులర్పించారు. రామకృష్ణ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు కవల నాగేశ్వరావు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ దాకే రాజు, నాయకులు బుట్ట సుబ్బారావు, కొయ్య దుర్గారావు, యండపల్లి పద్మావతి, యండపల్లి నాగేంద్ర(డాన్), యండపల్లి కృష్ణార్జునులు, కోడి దుర్గారావు ఉన్నారు.